క్లుప్తంగా

నేడు చెముడులంకలో గడప గడపకూ..

ఆలమూరు: చెముడులంకలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సర్పంచ్ తమ్మన శ్రీనివాస్, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో తుది విడత నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నఖినేటిపల్లి: మండలంలో పలు గ్రామాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. కేశవదాసుపాలెం, వీవీ మెరక, మోరి, మోరిపోడు, శృంగవరప్పాడు గ్రామాల్లో చెట్ల కొమ్మల తొలగింపుతో అంతరాయం కలుగుతుందన్నారు.

బాధితురాలికి సాయం



బాధితురాలికి సాయం అందిస్తున్న గంటా సోదరులు

మలికిపురం: తూర్పుపాలెం గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు గంటా వెంకటలక్ష్మికి వైద్యం నిమిత్తం గ్రామానికి చెందిన గంటా బ్రదర్స్ సమకూర్చిన రూ.26 వేలను బుధవారం అందించారు. ఆ యువకుల సేవా దృక్పథాన్ని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గంటా రామస్వామి, గంటా బాలాజీ, తాడి చంటి, గంటా రమేష్, రాజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఫ్యామిలీ డాక్టర్

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని వైద్యాధికారి వి.గౌతమి అన్నారు. మాచవరం సచివాలయం-4లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రోగులకు ఈసీజీ, తదితర పరీక్షలను చేశారు. 104 వాహన వైద్యులు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్నవారికి మందులు అందజేశారు.

సామాజిక తనిఖీపై శిక్షణ

పి.గన్నవరం: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఈఓ కోన హెలీనా అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ చేసేందుకు మండలంలోని 84 పాఠశాలల హెచ్‌ఎంలకు బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ సామాజిక తనిఖీలో భాగంగా ఐదుగురు సభ్యులతో ఒక కమిటీగా ఏర్పడి పాఠశాలల స్థితిగతులను అధ్యాయనం చేయాలన్నారు. 'నాడు-నేడు' అభివృద్ధి పనులకు ముందు, తర్వాత పాఠశాలలు ఎలా ఉన్నాయి.. ఇంకా ఏం సౌకర్యాలు కల్పించాలనే 107 రకాల ప్రశ్నావళిని పూరించి, మండల విద్యాశాఖకు నివేదిక సమర్పించాలని సూచించారు. ఈ నివేదికను జిల్లా విద్యాశాఖకు పంపుతామని ఎంఈఓ తెలిపారు. రిసోర్స్‌పర్సన్లు సూర్యలక్ష్మి, కృష్ణకాంత్, పరిశీలకుడు కాజా మొహిద్దీన్ తదితరులు శిక్షణ ఇచ్చారు.

విద్యార్థులకు చేయూత

మలికిపురం: మేడిచర్లపాలెంలోని ప్రభుత్వ పాఠశాలకు దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. వీరి రవాణాకు ఏర్పాటు చేసిన ఆటో ఖర్చులకు గ్రామానికి చెందిన గుబ్బల త్రినాథ్, పద్మావతి దంపతులు ఏటా రూ. 10 వేల విరాళం అందిస్తున్నారు. ఈ ఏడాది విరాళాన్ని పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కానూరి దుర్గాప్రసన్న కుమార్‌కు బుధవారం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి దాత దంపతులను అభినందించారు. ఎంపీటీసీ ముత్యాల సాయిరామ్, రామలింగేశ్వరరావు, అన్నంనీడి పురుషోత్తం, మేడిచర్ల వెంకటేశ్వరరావు, గుబ్బల పుల్లయ్య, కానూరి రంజిత్, హెచ్‌ఎం నాగిరెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల ఏర్పాటు

ఆలమూరు: జొన్నాడ పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు వసతి గృహాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు మెరుగైన సేవలను అందిస్తున్న కార్మికులకు వసతి కల్పించాలనే ఉద్దేశంతో సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాండ్ర నాగమోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. దాతల సహకారంతో నిర్మించిన ఈ వసతి గృహాలను బుధవారం కార్మికులకు అప్పగించారు.

మద్యం సీసాల ధ్వంసం

ఆలమూరు: అమలాపురం ఎస్ఈబీ ప్రత్యేక అధికారి వి.శివరామకృష్ణ సమక్షంలో ఆలమూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ అక్రమ మద్యం సీసాలను ధ్వంసం చేశారు. రూ.60,430 విలువైన మద్యాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

గట్టు... బక్క చిక్కి నట్టు

- ఉనికి కోల్పోతున్న కాలువ గట్లు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

ఆలమూరు: కొంతమంది స్వార్థ ప్రయోజనాలకు కాలువ గట్లు బక్కచిక్కిపోతున్నాయి.. వెళ్లేందుకు ఆస్కారం లేకుండా మారుతున్నాయి.. ఇరిగేషన్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేక అంతకంతకూ తగ్గిపోతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న భూరక్ష సర్వేలో పూర్వపు కాలువ, పుంత గట్లు ఆక్రమణలు బయట పడుతుండటంతో కొంతమేర ఊరటనిస్తుంది. ఆలమూరు మండలం పెదపళ్ల, గుమ్మిలేరు, ఆలమూరు, కొత్తపేట మండలం పలివెల, అవిడి, రావులపాలెం మండలం ఈతకోట, కేతరాజుపల్లి తదితర గ్రామాల్లో కాలువ గట్లు బాగా కుచించుకుపోయాయి. పంట పొలాల రక్షణకు, ఉత్పత్తుల తరలింపునకు ఏర్పాటు చేసిన గట్లు కనుమరుగవుతున్నాయి. దశాబ్ద కాలం కిందట సుమారు ఎనిమిది నుంచి పది అడుగుల వెడల్పు కలిగి ఉండి నాలుగు చక్రాల వాహనాలు వెళ్లేందుకు ఉన్న గట్లు నేడు రైతు నడవలేని స్థితికి చేరుకున్నాయి. అక్రమార్కులు గట్లను తమ చేలల్లో కలుపుకొంటూ పోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని పలువురు అంటున్నారు. ఈ ఆక్రమణల సంగతి అలా ఉంచితే పంట బోదెలు కూడా మాయమవుతుండటంతో



పెదపళ్లలో ఆక్రమణకు గురైన జోడి చెట్ల కాలువ గట్టు

రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వర్షాలు అధికంగా కురిసే సమయంలో ముంపుబారి నుంచి రక్షించాల్సిన బోదెలు కూడా అన్యాక్రాంతం కావడం రైతులను మరింత కుంగదీస్తుంది. ఇప్పటికే కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో పలు చెరువు గట్లు ఆక్రమణదారుల చేతిలోకి వెళ్లిపోయాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అన్ని చోట్లా అదే పరిస్థితి

మూడు నియోజకవర్గాల్లో సుమారు 80 వేల ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. దీనికి ఆనుకుని సుమారు మూడు వేల ఎకరాల వరకూ కాలువ, పొలం గట్ల స్థలాలు ఉన్నాయి. పెద్ద కాలువ గట్టు విస్తీర్ణం 10 మీటర్ల నుంచి 15 మీటర్ల వరకూ, మీడియం పంట కాలువ గట్టు విస్తీర్ణం నాలుగు నుంచి ఐదు మీటర్ల వరకూ, పంట బోదెలు రెండు నుంచి మూడు అడుగుల వరకూ ఉండాలని ఇరిగేషన్ శాఖ చెబుతోంది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ప్రస్తుతం అధికారుల అనధికార లెక్కల ప్రకారం సుమారు వెయ్యి ఎకరాల భూమి ఆక్రమణదారుల కబంధ హస్తాల్లో చిక్కుకుని పోయిందని సమాచారం.

జగనన్న భూరక్షతో వెలుగులోకి...

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న భూరక్షతో కాలువ గట్ల ఆక్రమణలు బయట పడుతున్నాయి. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ ఆ గట్ల వెంబడి స్థలాన్ని స్వాధీనం చేసుకుని లోపల ఉన్న రైతులకు ప్రయోజనం, సౌకర్యకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాలువ గట్లను అన్యాక్రాంతం చేసిన వారిని గుర్తించి సత్వరమే స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..



కాలువ గట్ల ఆక్రమణ, లోపలి రైతులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. వారి సూచనలకు అనుగుణంగా చర్యలు చేపడతాం. జగనన్న భూరక్ష సర్వేలో ఇప్పటికే కాలువ గట్లను గుర్తించాం.

– కృష్ణ త్రిమూర్తులు, ఇరిగేషన్ శాఖ, ఆలమూరు

ఇబ్బందులు పడుతున్నాం



కాలువ గట్లు ఆక్రమణలకు గురవడంతో లోపల భూముల ఉన్న రైతులం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఒకప్పుడు ట్రాక్టర్ వెళ్లేదారి ఉన్న కాలువ గట్లు నేడు నడిచి వెళ్లేందుకు మాత్రమే వీలు కలుగుతుంది. అధికారులు స్పందించాలి.

–ఇల్లూరి వెంకటరమణ, రైతు, పినపళ్ల

కళాకారులను ఆదుకోవాలి

మామిడికుదురు: తమకు పెన్షన్ అందించి ఆదుకోవాలని కోరుతూ మామిడికుదురులో బుధవారం జరిగిన కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘ సమావేశం తీర్మానం చేసింది. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ఉండ్రు కృష్ణారావు కళావేదిక ప్రాంగణంలో జరిగిన సంఘ ఐదో వార్షికోత్సవ సమావేశానికి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మంగం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి శంకరరావు మాట్లాడారు. సంఘం గౌరవాధ్యక్షుడు ఈలి శ్రీనివాస్ మాట్లాడుతూ కళాకారులకు సరైన ప్రోత్సాహం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సమావేశంలో భవాని సీను, చింతామణి, సత్యహరిశ్చంద్ర, అల్లూరి సీతారామరాజు తదితర నాటకాల్లోని పలు సన్నివేశాలను కళాకారులు ప్రదర్శించి, ఆహుతులను ఉత్సాహ పరిచారు. నాటిక, బిచ్చగాడు, తదితర ఏకపాత్రాభినయం పాత్రలతో కళాకారులు ఆకట్టుకున్నారు. సంఘం వ్యవస్థాపకుడు మంగం సత్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరీదేవి, ఎంఏ వేమా, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎంపీటీసీ నయినాల సీతామహలక్ష్మి, సంఘం ప్రతినిధులు అడబాల సత్యనారాయణమూర్తి, దూసబోయిన వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు. ఉండ్రు కృష్ణారావు, ఆదిలక్ష్మి స్మారక ట్రస్ట్ తరఫున ఉండ్రు శ్రీరామారావు కళాకారులకు పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందించి సత్కరించారు.

సంక్షేమ ప్రభుత్వం మనది..

- అన్ని రంగాల్లో రాష్ట్రం ముందంజ
- ఎమ్మెల్యే చిట్టిబాబు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అయినవిల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్నింటా ముందంజలో నడుస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం అయినవిల్లి మండలం కె.జగన్నాథపురంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మేడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌లు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రెయిన్లు, రహదారులు నిర్మించాలని ఎమ్మెల్యేను పలువురు కోరారు. ఎమ్మెల్యే చిట్టిబాబు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి, ఎంపీటీసీ సభ్యురాలు జలగం హేమలత, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైస్



కె.జగన్నాథపురంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ఎంపీపీ బయ్యా చినబాబు, మట్టపర్తి రామారావు తదితరులు పాల్గొన్నారు.

- కె.జగన్నాథపురం చెరువులో ఉపాధి పథకం నిధులు రూ.13 లక్షలతో పూడిక తీత పనులను ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రారంభించారు. ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, నాయకులు వాసంశెట్టి తాతాజీ, వారా జయసావిత్రి, కుసుమ లిల్లీ మంగేష్కర్, యడ్ల కిరణ్‌బాబు తదితరులు ఉన్నారు.

పాలకవర్గం ప్రమాణ స్వీకారం

మాగాం పీఏసీఎస్ పాలకవర్గం చైర్మన్‌గా వేటుకూరి



మాగం పీఏసీఎస్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే చిట్టిబాబు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, కారెం శివాజీ

సుబ్బరాజు, డైరెక్టర్లుగా తాటిపాక జోష్‌కుమార్, తాడినాటి శ్రీనివాసరావులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ కారెం శివాజీ ముఖ్య అతిథులుగా హాజరై పాలకవర్గ సభ్యులను సత్కరించారు. ఇందులో సర్పంచ్ కాశీ వీరవెంకట సత్యనారాయణ, వేటుకూరి కాశీ విశ్వనాథరాజు, సవరపు సంపదరావు, బొక్కా నాగరాజు, ఈతకోట వీరవెంకట సత్యనారాయణ ఉన్నారు.

జీవ నియంత్రణ పద్ధతులతో రూగోస్ నివారణ

అంబాజీపేట: కొబ్బరి తోటలను తీవ్రంగా నష్టపరుస్తున్న రూగోస్ (తెల్లదోమ)ను జీవ నియంత్రణ పద్ధతులతో నివారించవచ్చని ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు అన్నారు. అంబాజీపేట వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆర్బీకేల గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులకు కొబ్బరి, ఇతర పంటలను ఆశించే రూగోస్ నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు, సీనియర్ శాస్త్రవేత్తలు ఎన్‌బీవీ చలపతిరావు మాట్లాడుతూ తెల్లదోమ ఉధృతి తక్కువ ఉన్న సమయంలో మిత్ర పురుగు అయిన సూడిమెల్లాడ ఆస్టర్ 100–150 గుడ్లు, మధ్యస్తంగా ఉన్నప్పుడు 300–500 గుడ్లు ఒక్కో చెట్టుకు విడుదల చేయాలన్నారు. తెల్లదోమలను ఆశించే మిత్ర పురుగైన ఎన్‌కార్సియా గ్వేలోపే అనే బదనికలను సహజ సిద్ధంగా అభివృద్ధి చెందిన కొబ్బరి తోటల నుంచి సేకరించి, తెల్లదోమ ఆశించిన కొత్త ప్రాంతాల్లో విడుదల చేయాలన్నారు. జిల్లా ఉద్యాన అధికారి ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ రూగోస్ నియంత్రణపై వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావు, వై.సత్యనారాయణ పాల్గొన్నారు.



ముక్కామలలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవధాన్యాల సాగుతో లాభాలు

నవధాన్యాల సాగుతో భూమిలో సారం పెరగడంతో పాటు పంటలలో జీవ వైవిధ్యం ఏర్పడుతుందని ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, ఏఓ కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. ముక్కామలలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 ఎకరాల స్థలంలో నవధాన్యాలు వేయడం వల్ల భూమిలోని సారం పెరిగి వరి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం కముజువారిలంకలో సమావేశం నిర్వహించారు. ఎస్పీఎంయూ రాము, ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్ జె.నాగవేణి పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శంకరగుప్తంలో ప్రధాన రహదారి నుంచి పడమటిపాలెం తాడివారి గ్రూపు వరకూ రూ.1.30 కోట్లతో బీటీ రోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కాలనీలతో పాటు, ప్రధాన లింక్ రోడ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి నిధులు కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంకా ప్రతిపాదనల దశలో ఉన్న చింతలపల్లి– లక్కవరం, కేశనపల్లి, చింతలమోరి ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణం త్వరలోనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మాజీరావు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల కాశీ, సర్పంచ్ రాపాక ఆనంద కుమార్, ఎంపీటీసీ ఆచంట మాణిక్యం, శిరిగినీడి నారాయణరావు, ఆచంట బుజ్జి పాల్గొన్నారు.



టి.సావరంలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రూ.60 లక్షలతో రోడ్డు పనులు

గుడిమెళ్లంక గ్రామంలో టి.సావరం నుంచి అయ్యవారితిప్ప మీదుగా రూ.60 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వరప్రసాదరావు భూమిపూజ చేశారు. సర్పంచ్ నల్లి విజయకుమారి, పార్టీ నాయకులు కేవీఎస్ఎన్ రాజు, మంగెన సింహాద్రి, ఎంపీటీసీ అంజలీదేవి, నల్లి ప్రసాద్, కడలి బులిరెడ్డి, గుబ్బల వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకం

కొత్తపేట: ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రవచన దేవుని సంఘం, యెరూషలేము చర్చ్ పాస్టర్, కొగోప్ రీజినల్ ఓవర్‌సీర్ బిషప్ జీ అబెద్నగో– గ్రేస్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు ఏసు ప్రేమ సువార్త సభలు నిర్వహించారు. బుధవారం ముగింపు సభలో జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. లోక రక్షకుడు ఏసుక్రీస్తు చూపిన శాంతి, సహనం ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలన్నారు. ఏసు ప్రేమ సువార్త సభలు అందరి జీవితాల్లో వెలుగులు నింపుతాయని, లోక కల్యాణానికి దోహదపడతాయన్నారు. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ దైవ వర్తమానికులు జాషువా విజినోమై, పాస్టర్ జాయ్, పాస్టర్ రమేష్, సిస్టర్ నిషా జడ్సన్ తదితరులు ఆధ్యాత్మిక సందేశాలు అందించారు. సిస్టర్ మెర్సీ ఏంజెల్ ఏసుక్రీస్తును స్తుతిస్తూ ఆలపించిన గీతాలు



ఏసు ప్రేమ సువార్త ప్రార్థనల్లో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆకట్టుకున్నాయి. ముందుగా కొగోప్ యెరూషలేము చర్చి సభ్యులు, క్రైస్తవ బోధకులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు నేలపూడి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలి

అంబాజీపేట: ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. దీనిపై మండలంలోని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. దుకాణదారులకు వారం రోజులు సమయం ఇచ్చామని ఆ తరువాత ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే రూ.500 నుంచి రూ.5 వేల వరకూ జరిమానా విధిస్తామన్నారు.

ఉపాధ్యాయ సంఘాల నిరసన

కొత్తపేట: పార్వతీపురం డీఈఓ, ఇతర అధికారుల సస్పెన్షన్‌లకు, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వైఖరిని నిరసిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో కొత్తపేటలో ర్యాలీ నిర్వహించారు. కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, పి.గన్నవరం మండలాల ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు బుధవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు మెమోరాండం సమర్పించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా కార్యదర్శులు జీవీ రమణ, వై.మురళి, వై.బాలాజీ, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి వి.బాలకృష్ణ, పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరు

ఆలమూరు: చింతలూరులో శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు తెలిపారు. స్థానిక అమ్మవారి ఆలయ ముఖ మండపంలో ఈఓ ఉండవల్లి వీర్రాజు అధ్యక్షతన బుధవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణం, నూతన ప్రకార మండప నిర్మాణం గురించి వివరించారు. ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.60 కోట్లు అవసరం కాగా సీజీఎఫ్ నుంచి రూ.కోటి మంజూరైనట్లు ఈఓ వీర్రాజు తెలిపారు. మిగతా రూ.60 లక్షల మ్యాచింగ్ గ్రాంట్‌ను శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయం సమకూర్చాల్సి ఉందన్నారు. దీనిపై స్పందించిన వైఎస్సార్ సీపీ నేత నామాల శ్రీనివాసు తమ వంతు సాయంగా రూ.,00,116 అందజేశారు. అలాగే పెదపళ్లకు చెందిన చెక్కా భద్రరావు రూ.10,116, గన్ని చిన్నబ్బు రూ.25 వేలు, రోళ్ల శ్రీనివాసు రూ.10,116 విరాళాన్ని ప్రకటించారు. మ్యాచింగ్ గ్రాంట్‌కు సంబంధించి భక్తుల నుంచి విరాళాలను స్వీకరిస్తున్నట్లు ధర్మకర్తల మండలి తెలిపింది.

ఇబ్బందులు తొలగించండి

పి.గన్నవరం: పండించిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని, మిల్లర్ల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని జి.పెదపూడిలో రైతులు బుధవారం ధర్నా చేశారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంఈఓ కళ్యాణ కుమార్ రైతులతో చర్చించారు. సమస్యలు పరిష్కరిస్తామని వారు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- వాడపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం

కొత్తపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వాడపాలెం గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు పథకాల ద్వారా అందిన లబ్ధిని జగ్గిరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో అర్హులు పథకాల కోసం నిరీక్షించాల్సి వచ్చేదని, ప్రస్తుత ప్రభుత్వంలో ఇంటికే సంక్షేమ పథకాలు వస్తున్నాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు నేలపూడి భీమరాజు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పెదపూడి శ్రీని



వాడపాలెంలో లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

వాస్, మండల సేవాదళ్ కన్వీనర్ గూడపాటి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు

రావులపాలెం: టీడీపీ, జనసేనల నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. రావులపాలేనికి చెందిన సిద్ధివినాయక శెట్టిబలిజ సంఘ సభ్యులు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శెట్టిబలిజ సంఘం



రావులపాలెం సిద్ధి వినాయక శెట్టిబలిజ సంఘీయులకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే

అధ్యక్షుడు పితాని కుమారస్వామి, కార్యదర్శి పితాని వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్ పితాని శ్రీనివాస్, ట్రెజరర్ పితాని నాగేంద్ర శ్రీను, సభ్యులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. కలవచర్లకు చెందిన పలువురు గ్రామ పార్టీ ప్రెసిడెంట్ కుడుపూడి లోవరాజు, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఇందులో మల్లిపూడి సురేంద్ర, పుప్పాల నాగబాబు, వడ్డీ సూరిబాబు, పంతం వరప్రసాద్ తదితరులు ఉన్నారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

లూటుకుర్రులో సినీ సందడి



లూటుకుర్రులో ఓ సన్నివేశం చిత్రీకరణ

మామిడికుదురు: గ్రామీణ ప్రాంత బ్యాండ్ కళాకారుల జీవన విధానాలకు వాస్తవ రూపం కల్పిస్తూ గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు, ధీరజ్ నిర్మాతలుగా రూపొందుతున్న 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' షూటింగ్ బుధవారం లూటుకుర్రులో జరిగింది. ప్రతి నాయకుడు చేసిన తప్పులను ప్రజల సమక్షంలో విచారించే పలు సన్నివేశాలను పీహెచ్‌సీ వద్ద ఉన్న ప్రధాన రోడ్డుపై చిత్రీకరించారు. ఈ చిత్రంలో సుహాస్, శివాని హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ మొత్తం కోనసీమలోని అంబాజీపేట, తొండవరం, లూటుకుర్రు గ్రామాల్లో జరిగిందని దర్శకుడు దుశ్యంత్ చెప్పారు. లూటుకుర్రులో చివరి షెడ్యూల్ షూటింగ్ జరిగిందన్నారు. దర్శకుడిగా తనకు ఇది మొదటి చిత్రమని అన్నారు. జూన్, జులై నెలల్లో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. మొత్తం నాలుగు పాటలు ఉంటాయని, చిత్రీకరణ పూర్తయ్యిందన్నారు.

వారంలో వంతెన పనులు ప్రారంభం

పి.గన్నవరం: ఉచ్చులవారిపేట, చింతావారిపేటల మధ్య ప్రధాన పంట కాలువపై వంతెన నిర్మాణ పనులను వారం రోజుల్లో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వంతెన నిర్మాణానికి రూ.49.5 కోట్లు మంజూరు చేసిన విషయం విధితమే. ఇందులో భాగంగా ముందుగా ప్రధాన పంట కాలువపై వంతెన నిర్మిస్తారు.

అనంతరం వశిష్ట నదిపై వంతెన పనులు జరుగుతాయి. ప్రధాన పంట కాలువపై చింతావారిపేట, ఉచ్చులవారిపేటల మధ్య గతంలో పిల్లర్లు వేసి, వదిలేసిన ప్రాంతంలో పెద్ద వంతెన నిర్మించనున్నారు. ఈ ప్రాంతాన్ని బుధవారం ఇరిగేషన్ డీఈఈ కె.వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ డీఈ కె.సత్యవేణు, పీఆర్ డీఈఈ అన్యం రాంబాబు పరిశీలించారు. వంతెన నిర్మాణానికి మార్కింగ్ వేశారు. కాలువలకు నీరు నిలిపివేసిన అనంతరం పనులు ప్రారంభించి నెల రోజుల్లో పూర్తి చేయనున్నారు.

వంతెన నిర్మాణం కోసం నెల రోజులపాటు ఆర్పీ రోడ్డుపై రాకపోకలు నిలిపి వేయాలని పీఆర్ అధికారులు ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. ఇందుకు వారు అంగీకరించారు.ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు సంస్థ అధినేత పీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.



చింతావారిపేట, ఉచ్చులవారిపేటల మధ్య వంతెన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు